సాక్షి
కాకినాడ
ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



వాడపల్లి.. భక్తజనవాహిని

కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుని ఆలయానికి శనివారం వేలాదిగా భక్తులు పోటెత్తారు.

10లో



రత్నగిరిపై ప్రగతి సిరులు

సత్యదేవుని సన్నిధిలో కీలక మార్పులకు 2023 సాక్షీభూతంగా నిలిచింది. ఆధ్యాత్మికంగా, నిర్మాణాల పరంగా చరిత్రలో నిలిచిపోయే మార్పులకు ఈ సంవత్సరమే శ్రీకారం చుట్టారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 12,300 క్యూసెక్కుల గోదావరి నీటిని డెల్టాలకు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమడెల్టాకు 6,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనలో ప్రథమ బహుమతి



బహుమతిని అందుకుంటున్న విద్యార్థి సాయి

ప్రత్తిపాడు రూరల్: రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రత్తిపాడు మండలం ధర్మవరం హైస్కూల్ విద్యార్థి ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నాడు. ఇటీవల కడప జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తమ హైస్కూల్ విద్యార్థిని జి.సాయి రూపొందించిన రిమోట్ కంట్రోల్ అగ్రికల్చర్ మిషన్ ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి లభించినట్లు హైస్కూల్ హెచ్‌ఎం కె.చినరామమూర్తి శనివారం తెలిపారు. ఈ ప్రాజెక్టుకు గైడ్ టీచర్‌గా ఆకుల శివకుమార్ వ్యవహరించారు. కాగా ప్రథమ బహుమతి సాధించిన సాయిని ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

నేడు రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు



వివిధ జిల్లాల నుంచి పోటీల్లో పాల్గొననున్న ఎడ్లు, బండ్లు

రంగంపేట: రంగంపేట మండలం వడిశలేరులో ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్టు పోటీల ఆర్గనైజర్లు కూటి కోటేశ్వరరావు, బొప్పన బ్రహ్మాజీరావులు తెలిపారు. శనివారం వారిక్కడ మీడియాతో మాట్లాడుతూ గన్ని సత్యనారాయణ మూర్తి పేరిట ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గన్ని వ్యవసాయ క్షేత్రంలో జరిగే పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాలలో 1600, 1000 మీటర్ల ఎడ్లబండ్ల పరుగు పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు బుల్లెట్, ఎలక్ట్రికల్ బైకులు బహుమతులుగా అందిస్తామన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పోటీలకు భారీగా పోటీదారులు హాజరవుతారన్నారు. ఇప్పటికే పలు జిల్లాల నుంచి ఎడ్లు, బండ్లు చేరుకున్నాయన్నారు. ఉదయం 7 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. పోటీలకు జీఎస్ఎల్ మెడికల్ కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారని వివరించారు.

4 నుంచి గైట్‌లో చతుర్వేద మహాయాగం

రాజానగరం: ప్రపంచ శాంతిని కోరుతూ గైట్ ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో జనవరి 4 నుంచి 8వ తేదీ వరకూ చతుర్వేద యాగం నిర్వహిస్తున్నామని చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) తెలిపారు. అలాగే ఆంధ్ర సారస్వత పరిషత్‌తో కలిసి 5, 6, 7 తేదీలలో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించనున్నామన్నారు. నాలుగు వేదాలలో ఉన్న మంత్రాలను ఉచ్చారణ చేసి, చతుర్వేదాలలో ఉన్న విజ్ఞానాన్ని సామాన్యులకు కూడా అందించాలనే ఉద్దేశంతో చతుర్వేద యాగం నిర్వహిస్తున్నామన్నారు. యాగశాల ప్రాంగణంలో గోశాల, రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల నమూనాలను ఉత్సవ విగ్రహాలతో సహా ఏర్పాటుచేస్తామన్నారు. ఐదు రోజుల పాటు టీటీడీ ఆగమ పండితుల ఆధ్వర్యంలో వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. అలాగే తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పేలా మూడు రోజుల తెలుగు మహాసభలు జరుగుతాయన్నారు. వీటికి ఐదు రాష్ట్రాల గవర్నర్లు, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, సినీ, రాజకీయ రంగాల ప్రముఖులు హాజరవుతారని చైతన్యరాజు వివరించారు.

ఆరోగ్యమస్తు





- పేదలకు కార్పొరేట్ వైద్యం
- ఇంటి ముంగిటకే ఫ్యామిలీ డాక్టర్
- ఆరోగ్య సురక్షతో మరింత చేరువ
- ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

సాక్షి ప్రతినిధికాకినాడ: నిరుపేదల ఇంటి ముంగిటకే ప్రభుత్వం కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తోంది. ఈ ఏడాది వినూత్నమైన ఆరోగ్య కార్యక్రమాలతో పేదలందరికీ ఆరోగ్య భద్రత కల్పించింది. ఎన్నో ఏళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసింది. తద్వారా మెరుగైన సత్వర వైద్య సేవలందించేందుకు బాటలు వేసింది. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి వినూత్న కార్యక్రమాలను అందించగలిగింది. పేదలకు ఆరోగ్య వరాన్ని ప్రసాదించింది. ప్రాథమిక స్థాయి నుంచి జిల్లా ఆస్పత్రి వరకూ నిరాటంకంగా సేవలందిస్తున్నాయి.

ఆరోగ్య సిరి

దివంగత నేత వైఎస్సార్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ ప్రయోజనాలను ఆయన తనయుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరింత విస్తృత పరిచారు. నవరత్నాల ప్రయోజనాలను ఆరోగ్యశ్రీకి అనుసంధానించారు. రూ.1000 మించిన పై ఖర్చంతా ఆరోగ్య శ్రీ పరిధిలోకి వచ్చేలా చేశారు. ఈ పథకం పరిమితిని ఏకంగా రూ.25 లక్షలకు పెంచి ప్రజారోగ్యంపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. ఈ ఏడాదిలో కాకినాడ జిల్లాలో ఆరోగ్య శ్రీ పరిధిలో 28,371 చికిత్సలు నిర్వహించారు. ఇందుకు ప్రభుత్వం రూ.67.73 కోట్లు వెచ్చించింది.



ఈ ఏడాది నూతనంగా నియమితులైన స్టాఫ్‌నర్సులు



జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరం ద్వారా కాకినాడ జీజీహెచ్‌లో వృద్ధురాలిని చేర్చిన డీఎంహెచ్‌వో



ఆరోగ్యశ్రీ కార్డు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాడ చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి

ఆరోగ్య రథచక్రాలు

ఆరోగ్యసేవల్లో వాహనాలది కీలక పాత్ర. 108, 102, 104 ఇందులో ప్రధానమైనవి. జిల్లాలో 108 వాహనాలు 23 ఉన్నాయి. తద్వారా 24,259 మందికి సేవలందాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన మేర 74,609 మందికి ఒక వాహనం చొపున ఉంది. 102 వాహనాలు 29 ఉన్నాయి. వీటి ద్వారా 9,945 మంది తల్లులు సేవలు పొందారు. 104 మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా 1,28,300 మంది దీర్ఘకాలిక, స్వల్పకాలిక రోగులకు సేవలందాయి.

పింఛన్ భరోసా..

ప్రాణాంతక సమస్యలతో బాధపడుతున్న 20 మంది ఈ ఏడాది పింఛను ప్రయోజనాల కోసం నమోదు చేసుకున్నారు. ఇప్పటికే నమోదై ఉన్న తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా, సివియర్ హీమోఫీలియా బాధితులకు రూ.10 వేల చొప్పున, బైలేటరల్ ఎలిఫాంటియాసిస్, పరాలసిస్, మస్కులర్ డిస్ట్రోఫీ, సీకేడీ బాధితులకు నెలకు రూ.5 వేలు చొప్పున, మల్టీ డీఫార్మిటీ లెప్రసీ బాధితులకు రూ.3 వేల చొప్పున అంజేస్తున్నారు. వీరు కాక ఈ ఏడాది 1,168 హెచ్ఐవీ బాధితులకు రూ.2,250 చొప్పున పింఛన్లు అందజేస్తున్నారు.

అమ్మ కడుపు చల్లగా...

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పీఎస్ఎంఏ, పీఎంవీవై పరిధిలో గర్భిణులకు విశేష సేవలందిస్తోంది. ఈ ఒక్క ఏడాదిలోనే 19,029 మంది గర్భిణులకు ఉచిత ఆరోగ్య, స్కానింగ్ పరీక్షలు నిర్వహించింది. 6,106 మంది గర్భిణిలకు పీఎంవీవై పరిధిలో రూ.3.10 కోట్ల మొత్తాన్ని గర్భధారణ ప్రయోజనాల కింద అందించారు.

సురక్షతో రక్ష

ఈ ఏడాది జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు విశేష ప్రజాదరణ పొందాయి. స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యులు సేవలందించారు. అక్టోబర్ 21, సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 22 వరకు తొలి దశలో 511 శిబిరాలు నిర్వహించగా 1596 మందిని ఆసుపత్రులకు వివిధ చికిత్స నిమిత్తం పంపించారు. 3091 కంటి శుక్లాలు గుర్తించారు. 1652 మందికి ఆపరేషన్లు చేయించారు. 26,422 మందికి కళ్లజోళ్ల అవసరంగా గుర్తించి 2392 మందికి అందజేశారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కూడా ఎంతో ప్రజాదరణ పొందింది. గతంలో ఏ ప్రభుత్వమూ, మరే రాష్ట్రమూ అనుసరించని సరికొత్త ప్రయోగమిది.

ఈ అనుభవం... వచ్చే ఏడాది అవకాశం



వైద్య ఆరోగ్య చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఈ ఏడాదిలో సరికొత్త ప్రయోజనాల రూపకల్పన జరిగింది. అందులోనివే జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తదితరాలు. ప్రభుత్వం రూపొందించి పథకాలు, అందించిన ప్రయోజనాలను క్షేత్రస్థాయికి చేర్చడంలో సిబ్బంది కృషి ఎనలేనిది. కలెక్టర్ కృతిక శుక్ల మార్గనిర్దేశంలో ఈ ఏడాది ఫలవంతమైంది.

– డాక్టర్ నరసింహ నాయక్, డీఎంహెచ్‌వో

బోధనాసుపత్రి (కాకినాడ జీజీహెచ్)

ప్రాంతీయ ఆసుపత్రి (తుని ప్రాంతీయ ఆసుపత్రి)

సామాజిక ఆరోగ్య కేంద్రాలు	:	09
డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు	:	23
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	:	37
ఆరోగ్య ఉపకేంద్రాలు	:	277

నా భర్తకు పునర్జన్మ



ఆరోగ్యశ్రీతో నా భర్తకు పునర్జన్మ లభించింది. నవంబర్ 18న మా ఆయన బాబు రావు తీవ్ర గుండెపోటుకు గురయ్యారు. ఆ సమయంలో మా ఊరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతోంది. వెంటనే డాక్టర్లు వచ్చి అత్యవసర వైద్య సేవలు అందించారు. తర్వాత కాకినాడకు తరలించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో గుండెకు శస్త్ర చికిత్స చేశారు. ఇందుక మొత్తం ఖర్చు రూ.1.80 లక్షలను ఆరోగ్యశ్రీలో ప్రభుత్వమే చెల్లించింది. మా ఆయన కోలుకున్నారు.

– కుంచే కొండమ్మ, చేపూరు, తుని మండలం

'ఆరోగ్య సురక్ష'తో భరోసా



హాస్పటల్‌కు వెళ్లాలంటే భయపడేవాళ్లం. దూరం వెళ్లలేక, ఖర్చులు భరించలేక మందుల షాపులో మాత్రలు కొని వేసుకునేవాళ్లం. జగనన్న ఆరోగ్య సురక్ష వచ్చాక ఇంటి వద్దే వైద్యం పొందగలుగుతున్నాం. మా ఇంటికి ఆరోగ్య సిబ్బంది వచ్చి బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేశారు. నా సమస్యలు గుర్తించి వైద్య శిబిరం నిర్వహించే తేదీని ముందుగా చెప్పారు. శిబిరానికి వెళ్లి వైద్యం పొందాం. మా లాంటి వారి ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది.

చప్పిడి విజయలక్ష్మి,
రమణయ్యపేట, కాకినాడ రూరల్

రమణతత్వంతో మానసిక ప్రశాంతత



జయంతి వేడుకల్లో ప్రసంగిసున్న ఆధ్మాతిక గురువు డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు

ప్రత్తిపాడు రూరల్: రమణ తత్వంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని కృష్ణా జిల్లా పెదపులిపాక శ్రీవిద్యాపీఠం పీఠాధిపతి శ్రీవాసుదేవానంద గిరి స్వామిజీ అన్నారు. మండలంలోని రాచపల్లి శ్రీరమణా సేవాశ్రమంలో స్వామి రామానంద, స్వామి లక్ష్మణానంద ఆధ్వర్యంలో రమణ మహర్షి 144వ జయంతి వేడుకలు నిర్వహించారు. జ్ఞాన సరస్వతీ పీఠం పీఠాధిపతి ప్రకాశానంద సరస్వతీ, కాకినాడ ఆదిగురు యోగపీఠం పీఠాధిపతి సద్గురు సచ్చిదానంద యోగి, డాక్టర్ మైలవరపు శ్రీనివాస రావు, మాగాపు బ్రహ్మేశ్వరశర్మ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఆధ్యాత్మికకతోనే మానసిక ప్రశాంతత, శాంతి కలుగుతాయన్నారు. ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. వేడుకల్లో భాగంగా సుప్రభాత సేవ, అఖండజ్యోతి ప్రజ్వలన, సమష్టి ధ్యానం, ఉపనిషత్ పారాయణ, ప్రణవపతాక ప్రతిష్ఠాపన, రమణ అష్టోత్తర శతనామావళి అర్చన, దక్షిణామూర్తి హోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగాణంలో భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర మండలాల నుంచి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మికశోభ సంతరించుకొంది. రాచపల్లి రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. స్థానిక పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో శాంతిఆశ్రమం పీఠాధిపతి సుహితి మాతాజీ, వంగలపూడి సద్గురు సేవాశ్రమం పీఠాధిపతి నిర్విశేషానందగిరి మాతాజీ, లలితా గీతాశ్రమం పీఠాధిపతి విజ్ఞాన నందగిరి మాతాజీ, ఎరకంపాలెం శ్రీస్కందదేశికాశ్రమం పీఠాధిపతి స్వామీ లక్ష్మానంద, కాకినాడ ప్రణవ ఆశ్రమ పీఠాధిపతి సుమిత్రానంద సరస్వతీ మాతాజీ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ బి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పవన్‌కల్యాణ్ పర్యటన

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా కేంద్రం కాకినాడలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మూడు రోజుల పాటు నిర్వహించిన సమీక్ష సమావేశాలు ముగిశాయి. కాకినాడ విద్యుత్‌నగర్‌లో ప్రైవేట్ గృహంలో నిర్వహించిన సమీక్షలో శనివారం ఉదయం కాకినాడ అర్బన్ డివిజన్ల కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మరణించిన జనసేన కార్యకర్తలకు సంబంధించి 11 కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున బీమా చెక్కులు అందజేశారు. మధ్యాహ్నం జిల్లా పరిధిలోని టీడీపీ ఇన్‌చార్జిలతో అంతర్గతగ సమావేశం నిర్వహించారు. కాగా రాష్ట్రంలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని ప్రధానమంత్రి మోదీకు జనసేన అధినేత లేఖ రాశారు. పేదల ఇళ్లకు సేకరించిన స్థలాలో భారీగా అవినీతి జరిగిందని ఆయన ఆ లేఖలో ఆరోపించారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

అధికారులతో కలెక్టర్ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కాకినాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతమయ్యేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. జనవరి 3న సీఎం కాకినాడ నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి పర్యటనల సమన్వయకర్త తలశిల రఘురాం, ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, పెండెం దొరబాబు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ పాల్గొన్నారు. వాహనాల రూట్లు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్‌శాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. రోడ్ షో, బహిరంగ సభల వద్ద పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసరం వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు, కాన్వాయ్‌లో వైద్యాధికారులతో కూడిన అంబులెన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. సభా వేదిక, ప్రాంగణం ఏర్పాట్లను పెద్దాపురం ఆర్డీవో చేపట్టాలన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా వాహనాల పార్కింగుకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. తలశిల రఘురాం మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు హాజరయ్యే ప్రజలు, లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. అంతకు ముందు ఆయన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ ప్రదేశం రంగరాయ క్రీడామైదానం, హెలిప్యాడ్ నిమిత్తం జిల్లా పోలీసు మైదానం, రోడ్ షో నిర్వహించే ప్రదేశాలను పరిశీలించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయానికి బంగారు తాపడం

- రత్నగిరి టోల్‌గేట్ నుంచి రెండో మెట్లదారి నిర్మాణం
- రూ.15.5 లక్షలతో ఆదిశంకరమార్గ్‌కు రక్షణ
- ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం



వివిధ అంశాలపై చర్చిస్తున్న చైర్మన్ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్, ఇతర సభ్యులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రధానాలయ విమాన శిఖరానికి స్వర్ణరేకు తాపడం ఏర్పాటుకు దాతల నుంచి విరాళాలు సేకరించాలని దేవస్థానం ధర్మకర్తల మండలి తీర్మానించింది. రత్నగిరిపై శనివారం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. సత్యదేవుని విమాన గోపురానికి బంగారు తాపడం చేసేందుకు బంగారం డొనేషన్ స్కీంను ప్రారంభించాలని నిర్ణయించారు. సమావేశంలో దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఏసీ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన తీర్మానాలు ఇలా..

- పాత సీఆర్వో కార్యాలయం వెనక నుంచి రెండో ఘాట్‌రోడ్ వరకు నిర్మించిన ఆదిశంకర మార్గ్‌కు పక్కన లోయ వైపు భక్తుల భద్రత కోసం రూ.15.50 లక్షలతో 'క్రాస్ బరియర్స్' ఏర్పాటు చేయాలని తీర్మానించారు.
- కొండ దిగువ టోల్‌గేటు నుంచి కొండ మీద సెంటినరీ కాటేజీ వరకు మెట్ల మార్గం నిర్మించేందుకు రూ.85 లక్షల వ్యయంతో రూపొందించిన అంచనాలను ఆమోదించారు.
- అన్నవరం దేవస్థానం దత్తత గ్రామమైన కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ శ్లాబ్ మరమ్మతులకు రూ.3.05 లక్షల టెండర్‌ను ఆమోదిస్తూ తీర్మానించారు.
- మరో దత్తత గ్రామం కొవ్వూరులో భువనేశ్వరి అమ్మవారి ఆలయం ముందు భాగంలో జీఐ ప్రొఫైల్ షీట్‌తో షెడ్డు వేయడానికి రూ.5.26 లక్షలతో దాఖలైన లోయెస్ట్ టెండర్‌ను ఆమోదిస్తూ తీర్మానించారు. ఆ ఆలయానికి రంగులు వేయడానికి రూ.2.66 లక్షలకు దాఖలైన టెండర్‌ను ఆమోదించారు.
- దేవస్థానంలో సెక్యూరిటీ గార్డుల వినియోగానికి మాక్స్ డిటెక్టివ్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారి లోయెస్ట్ టెండర్‌ను ఆమోదిస్తూ తీర్మానించారు.



వాడపల్లిలో భక్తజన సందోహం

వాడపల్లి.. భక్తజనవాహిని

ఆత్రేయపురం: ధనుర్మాసం, అందునా స్వామివారికి ప్రీతికరమైన శనివారం కావడంతో కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుని ఆలయానికి వేలాదిగా భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా ఏడు శనివారాల నోము ఆచరించిన వారు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారు పూర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాన్ని ప్రత్యేకంగా వివిధ రకాల పండ్లు, పువ్వులతో అలంకరించారు. ఆలయ ఆవరణలో సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యాన పర్యవేక్షించారు. భక్తుల విరాళాలు, కానుకల రూపంలో స్వామి వారికి రూ.30,07,239 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు.



పూర్ణాలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి →

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



పురుషుల విభాగం విజేతలతో ద్వారంపూడి వీరభద్రారెడ్డి, మురళీధర్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ కాకినాడ సీపోర్ట్స్ సిల్వర్‌జూబ్లీ అంతర్రాష్ట్ర బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. స్థానిక ద్రోణ అకాడమీలో శనివారం నిర్వహించిన మ్యాచ్‌లను ఒలింపిక్ సంఘం సీఈఓ చుండ్రు గోవిందరాజు, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, కాకినాడ బ్యాడ్మింటన్ సంఘాల అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కాకినాడ సీపోర్ట్స్ సీఈఓ ఎం.మురళీధర్ ప్రారంభించారు. 45+ పురుషులు, పురుషులు డబుల్స్‌లో ఈ పోటీలు జరిగాయి. పురుషుల డబుల్స్‌లో ఇ.సిద్ధార్థ – ఎ.చైతన్యరెడ్డి, కర్రి సాయి పవన్ – పి.చంద్రగోపీనాథ్, రాహుల్ అజాద్ – ఇ.రేణుకా కిరణ్ మౌళి మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 45+ డబుల్స్‌లో పడాల శ్రీవెంకట జగన్నాథ్ – దాసరి సునీల్ కుమార్, సీహెచ్ సన్యాసిరావు – జి.సూరిబాబు, పీజీ సత్యనారాయణ – సీహెచ్ శ్రీను మొదటి మూడు స్థానాలూ కైవసం చేసుకున్నారు. విజేతలకు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, మురళీధర్‌లు బహుమతులు అందజేశారు. ఈ పోటీలను జాతీయ స్థాయి రిఫరీ పాయసం శ్రీనివాస్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘ కార్యదర్శి జి.ఎలీషాబాబు, పోటీల నిర్వహణ కమిటీ సభ్యులు ఫణిగోపాల్, గణేష్, కృష్ణంరాజు, బి.కృష్ణమూర్తి, డీఏఎస్ ప్రసాద్‌వర్మ, ఎం.రాజారెడ్డి బాపిరాజు, కె.పురుషోత్తం, ద్రోణా అకాడమీ నిర్వాహకులు మూర్తి తదితరులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

గేదెకు కవల దూడలు



అమలాపురం రూరల్: కామనగరువు గ్రామానికి చెందిన రైతు అత్తిలి సత్తిరాజు కమతంలో ఓ గేదె రెండు దున్న దూడలకు శనివారం ఉదయం జన్మనిచ్చింది. సాధారణంగా ఆవులు, గేదెలకు కవల దూడలు పుట్టడం అరుదు. ఈ నేపథ్యంలో తమ గేదెకు కవలు దూడలు పుట్టడంపై ఆ రైతు కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తోంది. గ్రామంలోని రైతులు ఆ దూడలను ఆసక్తిగా తిలకించారు.

ప్రైవేటు బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఆలమూరు: జొన్నాడ – మండపేట రోడ్డులో కొత్తూరు సెంటర్ వద్ద జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై ఎల్.శ్రీను నాయక్ కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సీలాద్రిరావుపేట గ్రామానికి చెందిన డ్రైవర్ నక్కా వీరన్న (29) వృత్తి పని మీద శనివారం ఉదయం తన బైక్‌పై కాకినాడ వెళుతున్నాడు. స్థానిక బ్లూ బెల్స్ కాన్వెంట్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి అతి వేగంతో వస్తున్న కావేరీ ట్రావెల్స్ ప్రైవేటు బస్సు అతడిని బలంగా ఢీకొంది.

ఈ ప్రమాదంలో తల నుజ్జునుజ్జవడంతో వీరన్న అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రత్నగిరిపై ప్రగతి సిరులు

- సత్యదేవుని సన్నిధిలో కీలక మార్పులకు సాక్షిగా 2023
- పదేళ్ల తరువాత అనేక అభివృద్ధి పథకాలకు శ్రీకారం

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో కీలక మార్పులకు 2023 సాక్షీభూతంగా నిలిచింది. అటు ఆధ్యాత్మికంగా, ఇటు నిర్మాణాల పరంగా చరిత్రలో నిలిచిపోయే మార్పులకు ఈ సంవత్సరమే శ్రీకారం చుట్టారు. గత పదేళ్లలో దేవస్థానంలో పెద్దగా చెప్పుకోదగిన నిర్మాణాలు లేవు. ఈ పరిస్థితుల్లో గత ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ చొరవతో 2023లో అనేక నిర్మాణాలు రూపుదిద్దుకున్నాయి. వీటిలో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుత ఈఓ కె.రామచంద్రమోహన్ కూడా దేవస్థానం అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నారు. మధ్యలో నిలిచిపోయిన అనేక నిర్మాణ పనులు చురుకుగా జరిగేలా చూస్తున్నారు. ఫలితంగా ఈ కార్తిక మాసంలో సత్యదేవునికి రికార్డు స్థాయిలో రూ.20.60 కోట్ల ఆదాయం సమకూరింది. సుమారు రూ.30 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న శివసదన్, డార్మెట్రీ, ఆదిశంకర మార్గ్, ఇతర నిర్మాణ పథకాలను డిప్యూటీ సీఎం, దేవదాయ, ధర్మదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ ఈ నెల 19న ప్రారంభించారు. దేవస్థానంలో ఇంత భారీ స్థాయిలో ప్రారంభోత్సవాలు జరగడం ఇదే ప్రథమం. అన్నవరం దేవస్థానంలో ఈ ఏడాది జరిగిన అభివృద్ధిపై అవలోకనం..

అందుబాటులోకి శివసదన్ సత్రం

సత్యగిరిపై సుమారు రూ.20 కోట్లతో నిర్మించిన 135 గదుల శివసదన్ సత్రం ఈ ఏడాది నవంబర్ నుంచి భక్తులకు అందుబాటులోకి వచ్చింది. ఈ సత్రం నిర్మాణం 2018లో మొదలైంది. కరోనా ప్రభావంతో రెండేళ్లు, అది సృష్టించిన ఆర్థిక ఇబ్బందులతో మరో ఏడాది పనులు నెమ్మదించాయి. 2023 మార్చిలో దేవస్థానం ఈఓగా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్ ఆజాద్ చొరవతో దీని నిర్మాణం పూర్తవడంతో భక్తుల వసతి సమస్య చాలా వరకూ పరిష్కారమైంది. ఈ సత్రం ద్వారా రోజుకు సుమారు రూ.2 లక్షల ఆదాయం వస్తోంది.

డార్మెట్రీ రెడీ

దాత పెన్నాడ రాజామణి రూ.2 కోట్ల వ్యయంతో శ్రీ వనదుర్గ ఆలయం వద్ద నిర్మించిన మూడంతస్తుల యాత్రికుల విశ్రాంతి భవనం (డార్మెట్రీ) కూడా కార్తిక మాసంలోనే భక్తులకు అందుబాటులోకి వచ్చింది. దీనిని మెట్ల దారిన వచ్చే భక్తుల కోసం నిర్మించినప్పటికీ, వసతి గదులు లభ్యం కాని వారికి ఇది ఎంతో ఉపయోగపడుతోంది. ఇక్కడ సుమారు 1,500 మంది భక్తులు విశ్రాంతి తీసుకునే వీలుంది.



సత్యదేవుని ఆలయం

రత్నగిరి 2023 రివైండ్

రూ.4 కోట్లతో నమూనా ఆలయం

రూ.4 కోట్లతో నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయం పనులు ఈ ఏడాది ప్రారంభమై, చురుకుగా జరుగుతున్నాయి. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం జాతీయ రహదారిపై డిగ్రీ కళాశాల సమీపాన ఈ ఆలయం నిర్మిస్తున్నారు. ఇక్కడ సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల ఉత్సవమూర్తుల దర్శనంతో పాటు సత్యదేవుని ప్రసాదం విక్రయాల కౌంటర్ కూడా ఏర్పాటు చేయనున్నారు. దీంతోపాటు విశ్రాంతి భవనాలు, టాయిలెట్ బ్లాక్‌లు, క్యాంటీన్ సదుపాయాలు కల్పిస్తున్నారు.

ఆదిశంకర మార్గ్, ప్రకాష్ సదన్ ర్యాంపు

పాత సీఆర్ఓ కార్యాలయం వెనుక నుంచి రెండో ఘాట్ రోడ్డుకు కలుపుతూ నిర్మించిన ఆదిశంకర మార్గ్ భక్తులకు ఎంతో ఉపయోగపడింది. గత కార్తిక మాసంలో ఈ రోడ్డు మీదుగా వందలాది వాహనాలు కొండ దిగువకు వెళ్లడంతో రత్నగిరిపై ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగలేదు. అదేవిధంగా ప్రకాష్ సదన్ పక్క నుంచి నిర్మించిన ర్యాంపు రోడ్డు ద్వారా వాహనాలు నేరుగా పశ్చిమ రాజగోపురం వైపు వెళ్లే అవకాశం కలిగింది. సత్యగిరి రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన మల్టీ లెవెల్ పార్కింగ్ కూడా వందలాది వాహనాలను నిలిపేందుకు ఉపయోగపడింది. ఇవే కాకుండా కొండ దిగువన కళాశాల మైదానంలో భక్తుల విశ్రాంతి షెడ్లు, స్వామివారి ఆలయం వద్ద విశాలమైన క్యూ లైన్లు భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయి.

ముత్తంగి సేవ.. నిజరూప దర్శనం

సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరులకు ముత్యాలతో చేసిన వస్త్రాలతో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ముత్తంగి సేవను ఈ ఏడాదే ప్రారంభించారు. ఇది భక్తులకు మధురానుభూతిని కలిగిస్తోంది. అలాగే, ప్రతి గురువారం స్వామివారి నిజరూప దర్శనం కూడా భక్తులకు కన్నుల పండగే అవుతోంది.

నాలుగు దేవతా ప్రతిరూపాలు

క్షీరసాగర మథనంలో ఉద్భవించిన నాలుగు దేవతా ప్రతిరూపాలు గంధపు చెట్టు, (గంధపు గిన్నె), లక్ష్మీదేవి (లక్ష్మీ హుండీ), కల్పవృక్షం, కామధేనువు రూపాలను సత్యదేవుని ఆలయం నలుదిక్కులా ఏర్పాటు చేశారు. వాటిని దర్శిస్తూ ప్రదక్షిణ చేసే వీలు కల్పించారు. ఈ ప్రదక్షిణ దర్శనం భక్తులకు చాలా సంతృప్తినివ్వడంతో పాటు ఆధ్యాత్మిక పరిమళాలను మరింతగా వెదజల్లుతోంది.

మాడ వీధుల ప్రణాళిక

తిరుమల తరహాలో సత్యదేవుని ఆలయానికి కూడా నాలుగు వైపులా మాడ వీధుల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధమైంది. సుమారు రూ.12 కోట్ల వ్యయం కానుండటంతో దేవస్థానం అధికారులు దీనిపై తర్జనభర్జన పడుతున్నారు. ఇది ఎప్పటికైనా పూర్తవుతుందనే విశ్వాసం అందరిలో వ్యక్తమవుతోంది.



ముత్తంగి వస్త్రాలంకరణలో సత్యదేవుడు, అమ్మవారు, శంకరులు

అమ్మవారికీ వజ్రకిరీటం

ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత మట్టే సత్యప్రసాద్ దంపతులు సత్యదేవునికి ఏడాది క్రితం రూ.2 కోట్లతో వజ్రకిరీటం చేయించిన విషయం విదితమే. వారు ఈ ఏడాది అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి కూడా మరో రూ.2 కోట్లతో వజ్రకిరీటం చేయిస్తున్నారు. దీనిని మరో నెల రోజుల్లో అమ్మవారికి అలంకరించనున్నారు.

- కార్తిక పౌర్ణమి నాడు జరిగిన సత్యదేవుని గిరి ప్రదక్షిణలో 2 లక్షల మంది భక్తులు, సత్యదేవుని దర్శనానికి 1.5 లక్షల మంది భక్తులు తరలి వచ్చారు. ఆ రోజు అన్నవరాన్ని భక్తజన సునామీ ముంచెత్తింది.
- 30 వీఐపీ సత్రం స్థానంలో విశాలమైన విశ్రాంతి షెడ్డు భక్తులకు వరంగా నిలిచింది. ఇక్కడ శాశ్వత షెడ్డు నిర్మాణానికి ప్రణాళిక రూపుదిద్దుకుంది.
- కొత్త సంవత్సరంలో కూడా సత్యదేవుని సన్నిధిలో అనేక నిర్మాణాలు, సేవా కార్యక్రమాలు రూపుదిద్దుకోవాలని అందరూ ఆశిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండోలో పతకాలు



రాష్ట్ర స్థాయి తైక్వాండోలో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన ఉమ్మడి జిల్లా జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విజయవాడలోని ఏపీఎస్ ఆర్ఎంసీ హైస్కూల్‌లో శుక్ర, శనివారాల్లో జరిగిన 39వ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. జూనియర్స్ విభాగంలో 18 బంగారు, 8 రజత, 8 కాంస్య పతకాలు అందుకున్నారు. తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్, ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కార్యదర్శి ఎలీషాబాబు, మాజీ ఒలింపిక్ సంఘ కార్యదర్శి పద్మనాభం అభినందించారు.

మంచు పరదాల్లో మాయమైనది



శరత్కాలం వెళ్లి.. హేమంతం ప్రవేశించి అప్పుడే పక్షం రోజులు దాటిపోయింది. హేమంతం అంటేనే 'హిమ'వంతం.. పట్టపగలు కూడా ఒక్కోసారి సూర్యుడి జాడే సరిగ్గా కానరాదు.. వచ్చినా ఆ ఎండ కూడా కాసేపే.. రాత్రవుతున్నకొద్దీ చలి పులి పంజా విసురుతూంటుంది. వేకువన మంచు తెరలుతెరలుగా నేలతల్లిని చుట్టేస్తూ ఉంటుంది. అందునా పచ్చని కోనసీమలో 'హిమ' మహిమలు చెప్పనలవి కాదు. పి.గన్నవరం వద్ద కొత్త అక్విడెక్ట్ ఆ కొన భాగం, పావన వైనతేయ గోదావరి నది శనివారం ఉదయం దట్టమైన మంచు పరదాల్లో మాయమైన అందాల చిత్రమిది.

– పి.గన్నవరం